పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- పోలీస్ స్టేషన్ తనిఖీ

తలమడుగు, మార్చి 15 ః మహారాష్ట్ర సరిహద్దున ఉన్నందున అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం ఇవ్వకుండా పూర్తిగా రూపుమాపాలని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం మండల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బంది సూచనలు చేశారు. రెండు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ అరికట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ గ్రామీణ సీఐ కె.ఫణిదర్, ఎస్సై అంజమ్మ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి..

తాంసి, మార్చి 15 ః నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాధిక, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పదిలో వంద శాతం ఫలితాలు సాధించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- ఉమ్మడి జిల్లా ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం

ఉట్నూర్, మార్చి15 ః రానున్న పదో తరగతి ఫలితాలు వంద శాతం వచ్చేలా కృషి చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున వారికి సబ్జెక్టులవారీగా సమీక్షించాలని సూచించారు. విద్యార్థుల పరీక్షలు పూర్తయ్యే వరకు సెలవులు తీసుకోరాదన్నారు. పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలన్నారు. గ్రేడ్లవారీగా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సమావేశంలో డీడీలు రమాదేవి, అంబాజీ, ఆర్‌సీవో ఆగస్టీన్, నాలుగు జిల్లాల ఏటీడీవోలు, ఏసీఎంవోలు, జీసీడీలు, క్రీడాధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామంలోని బెల్ట్‌షాపు

బెల్ట్ షాపులు

మద్యం మత్తులో గొడవలు

- స్థానికులు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- అధిక ధరలు వసూలు.. పట్టించుకోని అధికారులు

ఆదిలాబాద్, మార్చి 15(నమస్తే తెలంగాణ) ః ఆదిలాబాద్ జిల్లాలో బెల్ట్‌షాపులకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. కిరాణ కొట్టు మాదిరిగా గ్రామ, గ్రామాన వెలుస్తున్నాయి. ఈ వ్యాపారం లాభసాటిగా మారడంతో బెల్ట్‌షాపులు పెట్టుకునేందుకు పోటీ పడుతున్నారు. అధికారులు, స్థానిక నాయకులను మచ్చిక చేసుకుని దుకాణాలను ప్రారంభించి వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఈ దుకాణాల నిర్వాహకులు అనుమతులు లేకున్నా.. పల్లెల్లో మద్యం విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో బెల్ట్‌షాపులను స్థానికులు వ్యతిరేకించినా ఫలితం లేకుండా పోతున్నది. తాజాగా శుక్రవారం జైనథ్ మండలంలోని గూడలో బెల్ట్‌షాపులో మద్యం తాగిన వారి మధ్య గొడవ కత్తిపోట్లకు దారి తీసింది. ఇక్కడ రెండు బెల్ట్‌షాపులు నిర్వహిస్తుండగా వీటిని మూసివేయించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 300 వరకు బెల్లు దుకాణాలు ఉన్నట్లు తెలుస్తుంది.

మద్యానికి బానిస, గొడకు కారణం

అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులు ప్రశాంతమైన గ్రామీణ వాతావరణాన్ని చెడగొడుతున్నాయి. యువత మద్యానికి బానిస అవుతుండగా గొడవులు జరుగుతున్నాయి. జిల్లాలోని జాతీయ రహదారికి పక్కన ఉన్న దాబాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా దాబాల్లో మద్యం విక్రయాలు జరుపుతున్నారు. గ్రామాల్లో దళారులు వేలం పాట ద్వారా ఈ దుకాణాలను దక్కించుకుంటున్నారు. వేలం పాట డబ్బులను రాబట్టుకోవడంతోపాటు, అక్రమ సంపాదన కోసం మద్యాన్ని ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. మద్యం దుకాణాల నుంచి కొనుగోలు చేసిన ధర కంటే రూ. 10 నుంచి రూ.20 అధికంగా వసూలు చేస్తున్నారు. జిల్లాకు పక్కనే మహారాష్ట్ర ఉండడంతో అక్కడి నుంచి మందుబాటిళ్లను తీసుకొచ్చి అక్రమంగా విక్రయిస్తున్నారు. బెల్ట్‌షాపులు, డాబాల్లో మద్యం విక్రయిస్తున్న దళారులు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. దీంతో మద్యం కొనుగోలుదారులు నష్టపోవాల్సి వస్తుంది. అధికారులు తెలిసే ఈ వ్యవహారం జరుగుతుందని స్థానికులు అంటున్నారు. అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులను తొలగించాలని కోరుతున్నారు.

ఈద్గాను సందర్శించిన అదనపు కలెక్టర్

ఈద్గాను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

భైంసా, మార్చి 15 : గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమీపంలో గల ఈద్గాను నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఈయన వెంట మున్సిపల్ కమిషనర్ రాజేశ్ కుమార్, నాయకులు ఫయజుల్లాఖాన్ ఉన్నారు.

మహిళ ప్రాణాలు కాపాడిన పెట్రోకార్ పోలీసులు

మహిళా కానిస్టేబుళ్లకు ఎస్పీ జానకి షర్మిల అభినందనలు

రుక్మాబాయిని కాపాడిన బ్లూకోల్ట్ సిబ్బంది

భైంసా, మార్చి 15 : భైంసా సమీపంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన రుక్మాబాయి ప్రాణాలను శనివారం బ్లూకోల్ట్ పెట్రోకార్ విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు అనిత, సంగీతలు కాపాడారు. బోయిగల్లికి చెందిన రుక్మాబాయి ఇంట్లో ఏమి పనిచేయట్లేదని భర్త తిట్టడంతో తీవ్ర మనసాస్తాపానికి గురైంది. గడ్డెన్నవాగు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకోబోతుండగా మహిళా పోలీసు సిబ్బంది కాపాడారు. ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించి తన కుమారుడు భీమేశ్‌కు అప్పగించారు. అంతేగాకుండా రుక్మాబాయి భర్త పోశెట్టికి కూడా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్లను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

మాట్లాడుతున్న ఎస్సై వి.పురుషోత్తం

హత్యాయత్నానికి పాల్పడ్డ ఇద్దరి రిమాండ్

జైనథ్, మార్చి 15 ః గూడ గ్రామంలో ఈనెల 14న సాయంత్రం 7 గంటలకు అజయ్, అశోక్ లు కుమ్ర విష్ణు, మరి కొంతమంది కత్తితో పొడిచి హత్యాయత్నం చేశారని ఫిర్యాదు చేశారు. జైనథ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి శనివారం హత్యాయత్నం చేసిన కుమ్ర విష్ణు, చిలక సంకల్ప్‌ను గూడ గ్రామంలో పట్టుకున్నారు. వీరి నుంచి బైకు, హత్యాయత్నానికి ఉపయోగించిన కత్తిని స్వాధీన పర్చుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వి.పురుషోత్తం తెలిపారు.

ఏఐ బోధనకు శ్రీకారం

- వెనుకబడిన విద్యార్థుల కోసం వినూత్న కార్యక్రమాలు
- కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మార్చి 15 : వెనుకబడిన విద్యార్థుల కోసం వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇందులో భాగంగానే మొదట ఆరు జిల్లాల్లో ఏఐ ఆధారిత ఆన్‌లైన్ లెర్నింగ్ ప్రాసెస్ ప్రారంభిందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం తాటిగూడలోని ప్రైమరీ, ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్-ఏఎక్స్ఎల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ముందుగా తల్లిదండ్రులకు ఏఐ ద్వారా అందించే బోధన గురించి తెలిపారు. వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా బోధన, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. సాంకేతికతను వినియోగించుకుంటూ సామర్థ్యాలను పెంచేలా ప్రభుత్వం ఏఐ బోధనలను ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో ఆరు ప్రైమరీ పాఠశాలను గుర్తించామన్నారు. తొలుత నాలుగు పాఠశాలల్లో ప్రారంభిస్తున్నామని, సోమవారం మరో నాలుగు పాఠశాలల్లో ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. 3 నుంచి 5 తరగతి విద్యార్థులు లాంగ్వేజ్, మ్యాథ్స్‌లో బోధనలు చేస్తారన్నారు. స్టేప్ ఫౌండేషన్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా బోధన చేస్తామన్నారు. విద్యార్థుల్లోని లోపాలను గుర్తించి వాటిని సరి చేయడానికి గైడ్ టీచర్ కూడా ఉంటారన్నారు. భవిష్యత్‌లో దీనిపై మంచి రిజల్ట్స్ వస్తాయని, ఎఫ్ఎల్ఎన్ మంచి ప్రతిభ కూడా చూపుతారన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో ప్రణీత, ఎంఈవో సోమయ్య, ఎస్ఎస్ఏ కో-ఆర్డినేటర్లు సుజాత్ ఖాన్, ఏఎస్ఓ శ్రీకాంత్ గౌడ్, హెచ్ఎం నారాయణ, ట్రెయినీ గణేశ్ పాల్గొన్నారు.

ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

ఓటరు జాబితా ఎన్నికల నిర్వహణపై శనివారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ వాటితో ముడిపడిన అంశాల గురించి చర్చించేందుకు వీలుగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ఫారం 6,7,8 చర్చించారు. 6 ఫారంలో 2247లో 40, 8లో 1054 పెండింగ్‌లో ఉన్నా వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పొలిటికల్ పార్టీ సమావేశంలో చర్చించిన అంశాలు, రిజిస్టర్లలో నమోదు చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణకు సంబంధించి కొత్తగా వచ్చిన దరఖాస్తులను వెంట పరిశీలిస్తూ సకాలంలో పరిష్కరించాలన్నారు. అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులు బీఎల్‌వోస్‌ను నియమించుకోవాలని అన్నారు. ఈనెల 21లోగా పెండింగ్ కేసులు క్లియర్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీవో వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఏఐ తరగతులు ప్రారంభం

తలమడుగు, మార్చి 15 ః దేవాపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, ఖోడద్ ప్రాథమిక పాఠశాలలో డీఈవో ప్రణీత తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రెయినీ కలెక్టర్ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు చిన్న వయస్సులోనే విద్యార్థులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులకు కంప్యూటర్ల సహాయంతో ఏఐ పాఠాలు అందించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక విద్యను అందించడం ద్వారా భవిష్యత్ అవకాశాలను మెరుగు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వెంకట్‌రావ్, దేవాపూర్ పాఠశాల హెచ్ఎం లచ్చన్న, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి, ప్రత్యుష తదితరులు పాల్గొన్నారు.

పైవేటుకు దీటుగా పాఠాలు

- కలెక్టర్ అభిలాష అభినవ్
- నిర్మల్ మండలంలోని మేడిపెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఏఐ ఆధారిత కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ఏఐ కంప్యూటర్ ద్వారా విద్యార్థులకు వివరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

సోన్, మార్చి 15 ః ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం నిర్మల్ మండలంలోని మేడిపెల్లి గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఏఐ ఆధారిత కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు కృత్రిమ మేధస్సు ద్వారా ప్రాథమిక స్థాయిలో చదవడం, రాయడం, గణితం సబ్జెక్టుల నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా నిర్మల్ జిల్లాలో 16 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ విద్యా యాప్‌లు, ఫ్లాట్ ఫాంలు ప్రతి విద్యార్థి అభ్యాసస్థాయిని గుర్తించి, మెరుగుపర్చేందుకు ప్రత్యేక పాఠాలను సూచిస్తాయని తెలిపారు. ఏఐ ఆధారిత యాప్‌లు కథలు, వీడియోలు, ఆటల ద్వారా పిల్లలలో చదవడం, లెక్కించడం మీద ఆసక్తిని పెంచుతాయని, కృత్రిమ మేధస్సును వినియోగించుకుని ప్రతి విద్యార్థి ప్రాథమిక విద్యలో నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రామారావు, ఎంపీడీవో గజానన్‌రావు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి..

నిర్మల్ అర్బన్, మార్చి 15 ః ఎల్ఆర్ఎస్ (లే అవుట్ క్రమబద్ధీకరణ)కు దరఖాస్తు చేసుకున్న వారందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు నిర్మల్ జిల్లాలోని మున్సిపాల్టీల పరిధిలో 17,906, గ్రామీణ ప్రాంతాల్లో 6,680 దరఖాస్తులను రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు అర్హులైన వారీగా గుర్తించినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ రుసుములో 25 శాతం రాయితీ కల్పించామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 31వ తేదీ వరకు గడువు ముగుస్తుందని తెలిపారు.

క్షయ వ్యాధిగ్రస్తులు ఆరోగ్యం కాపాడుకోవాలి

కలెక్టర్ రాజర్షి షా

టీబీ రోగులకు నిక్షయ్ పోషణ్ కిట్స్ అందజేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మార్చి 15 ః క్షయ వ్యాధిగ్రస్తులు తమ ఆరోగ్యం కాపాడుకోవాలని, సరైన సమయంలో మందులు వాడాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. వంద రోజుల టీబీ కార్యక్రమంలో భాగంగా శనివారం అంకోలి పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీబీ పేషెంట్లకు నిక్షయ్ పోషన్ కిట్స్‌ను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమానికి గ్లాండ్ ఫార్మా ప్రతినిధులు కెప్టెన్ రఘు రామన్, గిరీష్ సుబ్బరాజు, లోక భారతి ట్రస్ట్ కుమారన్ హాజరై కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షయ వ్యాధిగ్రస్తులు తమ ఆరోగ్యం నిలబెట్టుకోవాలంటే సరైన సమయంలో మందులు, పోషణ అవసరమని సూచించారు. అంకోలి పీహెచ్‌సీలో 125 టీబీ కేసులు ఉన్నాయన్నారు. 6 నెలలపాటు ప్రతినెల ఈ కిట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్, టీటీసీవో డాక్టర్ సుమలత, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, ఎన్సీడీ ప్రొగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్, డీఎల్‌వో డాక్టర్ గజానంద్, అంకోలి మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఆశ కిరణ్, డాక్టర్ సర్ఫరాజ్, టీబీ మెడికల్ ఆఫీసర్ల డాక్టర్ సాయి ప్రియ, షిరిన్ పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్

ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్

ఎదులాపురం, మార్చి 15 ః క్వార్టర్లీ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా శనివారం కలెక్టర్ రాజర్షి షా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక శాంతినగర్‌లోని ఈవీఎం గోదాంను పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి ఉన్నారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

మల్లయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు — మల్లయ్య (ఫైల్)

నర్సాపూర్ (జీ), మార్చి 15 : రాంపూర్ అనుబంధ గ్రామమైన నసీరాబాద్‌లో పంటను కాపాడుకునే ప్రయత్నంలో ఓ రైతు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. తమ చేనులో బొందుగుల మల్లయ్య(56) మొక్కజొన్న పంటను పందులు, మూగజీవాల నుంచి కాపాడుకునేందుకు పంట చుట్టూ సోలాల్ పవర్ అమర్చుకున్నాడు. కొన్ని రోజులుగా సోలార్ పని చేయడం లేదు. ఇది తెలుసుకున్న రైతు మల్లయ్య అడవి పందుల బాధ తగ్గాలని అతనికి వేరే మార్గం దొరకక ఆ సోలాల్ పవర్ సిస్టమ్ జే వైరుకు తన బోర్ పక్కన ఉన్న 3 ఫేజ్ మోటారు బాక్సులో ఉన్న ఫ్యూజ్‌లో నుంచి ఒక సింగిల్ ఫేస్ సప్లయ్ ద్వారా కరెంటు వైరు అమర్చుకుని పంటను కాపాడుకునేందుకు ప్రయత్నం చేశాడు. రోజులాగే శుక్రవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో పంటకు రక్షణ కల్పించేందుకు మల్లయ్య విద్యుత్ సోలార్ అమర్చే ప్రయత్నంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై సాయికిరణ్ కుటుంబీకులు తన భార్య చిన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.